క్లుప్తంగా

సాగర్ దారి జలమయం



మన్నెగూడ కూడలిలో వరదనీరు

తుర్కయంజాల్: తేలికపాటి వర్షానికే సాగర్ రహదారి జలమయం అయింది. ఆదివారం మధ్యాహ్నం కురిసిన వానకు మన్నెగూడ కూడలిలో భారీగా వరద నీరు నిలిచింది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అధికారులు స్పందించి వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కోదండరాంకు సన్మానం



కోదండరాంకు పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందజేస్తున్న వేదిక నేతలు

ఇబ్రహీంపట్నం: శాసన మండలి సభ్యుడిగా ఎన్నికైన ప్రొ. కోదండరాంను తెలంగాణ ఉద్యమకారుల వేదిక నేతలు ఆదివారం ఘనంగా సన్మానించారు. సన్మానంలో వేదిక నేతలు జంగయ్య, రవీందర్‌గుప్తా, అంజయ్య, ఎండీ ముజిబ్, డి.రమేష్, ఎస్.నిరంజన్, ఎండీ గౌస్ ఉన్నారు.

మందకృష్ణను కలిసిన శంకర్‌పల్లి నాయకులు



మందకృష్ణతో నాయకులు

శంకర్‌పల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సమితి శంకర్‌పల్లి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ.. మందకృష్ణ ఎస్సీ వర్గీకరణ కోసం 30ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగ ఉపకులాలకు లబ్ధి చేకూరుతుందన్నారు.

పుస్తెమెట్టెల అందజేత

కేశంపేట: పేదింటి అమ్మాయిల పెళ్లిళ్లకు మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి పుస్తె మెట్టెలను ఆదివారం అందజేశారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన అబ్బి లక్ష్మయ్య పద్మ, గౌతాపురం రాంచంద్రయ్య రాణి దంపతుల కుమార్తెల వివాహాల నిమిత్తం ఆయన పుస్తె మెట్టెల అందజేశారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి

ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్



విద్యార్థులకు బెల్టులు అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ, మాస్టర్లు

షాద్‌నగర్: విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పద్మావతి కన్వెన్షన్ హాల్‌లో న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆత్మరక్షణ కోసం యుద్ధ విద్యలు నేర్చుకోవాలని సూచించారు. ఇందులో న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ రాష్ట్ర అసిస్టెంట్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ నక్క బాల్‌రాజ్, మాస్టర్లు ఉన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో నేటి నుంచి ప్రారంభమయ్యే 41వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఆ ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం అన్నారు. ఆదివారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమ వారం స్వస్తిపుణ్యావచనము, అభిషేకం, గణపతి హోమం, మహా నైవేద్యం, హారతి, తీర్థప్రసాద వితరణ, రావిర్యాలలో ఘటం ఊరేగింపు ఉంటుందని తెలిపారు. మంగళవారం ఆలయ వద్ద అమ్మ వారి కల్యాణోత్సవం, అగ్నిగుండాలు, అన్నదానం, కార్యక్రమం, పోతురాజుల విన్యాసాలు, బోనాలు, బుధవారం నివేదన, హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

వన్యప్రాణులకు రక్షణ కరువు



సాగర్‌రోడ్డుపై గునుగల్ అటవీ ప్రాంతం

- చుట్టూ కంచెలేక రోడ్లపైకి వస్తున్న జింకలు
- రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్న జంతువులు
- కంచె నిర్మాణ ప్రతిపాదనల ఫలితం శూన్యం



నందివనపర్తిలో వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన జింక (ఫైల్)

యాచారం: గునుగల్ అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు రక్షణ కరువైంది. చుట్టూ కంచెలేక జంతువులు జనారణ్యంలో సంచరిస్తూ ప్రమాదాల బారిన పడుతుండగా.. గొడ్డలి వేటుకు క్రమంగా వృక్ష సంపద తరిగిపోతోంది. మహానగరానికి చేరువలో ఉన్న అరణ్యంలో జింకలు, నెమళ్లు, అడవి పందులతో పాటు పలు రకాల జంతువులు ఉన్నాయి. ఇక్కడి నుంచి 80 కిలో మీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలం మున్ననూర్ అడవి నుంచి జంతువులు రాకపోకలు సాగిస్తుంటాయి. చిరుతలు కూడా ఉండేవి. కానీ ప్రస్తుతం వాటి జాడ కానరావడం లేదు. 1674 హెక్టార్లలో.. చుట్టూ 58 కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్న అడవి.. జంతువులతో పాటు వృక్ష సంపదకు పెట్టింది పేరు. హైదరాబాద్‌కు 40 కిలో మీటర్ల దూరంలో సాగర్ రహదారికి ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతం ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకుంటుండగా.. చుట్టూ రక్షణగా ఎలాంటి కంచె లేకపోవడంతో వన్యప్రాణులు రహదారుల పైకి వచ్చి మృత్యువాత పడుతున్నాయి. పంటపొలాలను ధ్వంసం చేస్తున్నాయి.

58 కిలోమీటర్ల మేర..

వన్యప్రాణులు, వృక్ష సంపద రక్షణకు అడవి చుట్టూ కంచె నిర్మాణానికి ఇబ్రహీంపట్నం డివిజన్ అటవీ శాఖ అధికారి విష్ణువర్ధన్‌రావు గతంలో పూర్తిగా సర్వే చేయించారు. 58 కిలో మీటర్ల మేర పొడవునా కందకాల తవ్వకం, కంచె నిర్మాణం, అడవిలో బోరుబావులు తవ్వించి సోలార్ మోటార్ల ఏర్పాటు తదితర వాటి కోసం రూ.24 కోట్ల నిధుల మంజూరుకు అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపారు. కానీ ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. ఫలితంగా జంతువులు వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుంటుండగా.. విలువైన శ్రీగంధం, గంధ చెట్లు మాయం అవుతున్నాయి.

వీధి కుక్కల దాడి

ఈ అడవిలో సుమారు వెయ్యికి పైగా జింకలు ఉన్నాయి. చుట్టూ ఎలాంటి కంచె లేకపోవడంతో రోడ్లపైకి వస్తున్నాయి. ఈ క్రమంలో వాహనాలు ఢీకొట్టడమో.. వీధి కుక్కల బారిన పడి మృత్యువాత పడటం నిత్యం జరుగుతోంది. ఇటీవల నందివనపర్తి గ్రామంలో వ్యవసాయ పొలం వద్దకు వచ్చిన ఓ జింకపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. పక్షం రోజుల క్రితం చౌదర్‌పల్లి–గునుగల్ గేట్ల మధ్యన జింకలు గుంపులుగా సాగర్‌రోడ్డు పైకి రావడంతో ఓ వాహనదారుడు తనకారును సడన్ బ్రేక్ వేసి ఆపగా.. వెనకాల వస్తున్న రెండు వాహనాలు ఢీకొన్నాయి.

పరిహారం ఇవ్వాలి



అటవీ ప్రాంతానికి సమీపంలో గడ్డమల్లయ్యగూడ గ్రామ వ్యవసాయ పొలాలు ఉన్నాయి. అత్యధికంగా రైతులు కూరగాయల పంటలు, పండ్లతోటల పెంపకం చేపడుతున్నారు. అడవికి కంచె లేని కారణంగా జింకలు, అడవి పందులు వెలుపలకు వచ్చి, పంటలను ధ్వంసం చేస్తున్నాయి. తద్వారా తీవ్రంగా నష్టపోతున్నాం. పరిహారం చెల్లించాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు.

–సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, గడ్డమల్లయ్యగూడ

చర్యలు తీసుకోవాలి



పక్షం రోజుల క్రితం హైదరాబాద్ నుంచి మా స్వగ్రామం తక్కళ్లపల్లి తండాకు కుటుంబ సభ్యులతో కారులో వెళ్తున్నాను. గునుగల్ అడవిలోంచి జింకలు గుంపులుగా ఒక్కసారే రోడ్డు పైకి వచ్చాయి. వాటిని తప్పించడానికి సడన్‌గా బ్రేక్ వేయాల్సి వచ్చింది. అంతకు ముందే కొద్ది దూరంలో ఓ జంతువును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. వన్యప్రాణుల రక్షణకు చర్యలు తీసుకోవాలి.

– అంగోత్ తుకారాం, పర్వతారోహకుడు

ప్రతిపాదనలు పంపాం



అటవీ ప్రాంతం చుట్టూ కంచె, కందకాల నిర్మాణం కోసం నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. జింకల, ఇతర వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి అడవిలో మూడు సోలార్ బోర్లు ఏర్పాటు చేశాం. మరో రెండు బిగింపునకు కృషి చేస్తున్నాం. జంతువులను ఎవరైనా చంపితే కఠిన చర్యలు తీసుకుంటాం. పంట నష్ట పరిహారం చెల్లింపు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– నర్సింహనాయక్, గునుగల్ అటవీ సెక్షన్ అధికారి

ఘనంగా బోనాల ఉత్సవాలు



పోతురాజుల నృత్యాలు. చిత్రంలో చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు



తులేకలాన్ గ్రామంలో మహంకాళి బోనాల ఊరేగింపు

ఇబ్రహీంపట్నం రూరల్: మండల పరిధి తులేకలాన్ గ్రామంలో మహంకాళి బోనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉప్పరిగూడ, ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి రాందాస్‌పల్లిలో భక్తులు గ్రామదేవతలకు బోనం ఎత్తారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు డప్పుచప్పుళ్లతో మధ్య బోనాలను ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి తీసుకెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, కౌన్సిలర్లు కుంట్ల మౌనిక, మర్రి అర్చన, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విపక్షాలవి అసత్య ఆరోపణలు

- అర్హులైన రైతులందరికీ రుణమాఫీ
- డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: రుణమాఫీ విషయంలో విపక్ష నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రుణమాఫీతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తుంటే.. ప్రభుత్వ ప్రజారంజక పాలన చూసి జీర్ణించుకోలేని విపక్ష నేతలు విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను ప్రజలు తిరస్కరించినా.. ఆ పార్టీ నేతల్లో మార్పు రావడం లేదన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షలను మాఫీ చేసిందని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకు, అనుమానాలకు తావులేదని ఆయన స్పష్టంచేశారు. సాంకేతిక ఇతరేతర కారణం చేత ఎవరైనా రైతులు లబ్ధిపొందలేక పోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అలాంటి వాటిని సరిచేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ సర్పంచ్ శంకర్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భానుకిరణ్, శంకర్ తదితరులు ఉన్నారు.

రుణమాఫీపై విమర్శలు సరికాదు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రైతుల రుణమాఫీ అంశంపై ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ నేతలు విమర్శలు చేయడం సరికాదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో రైతులతో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలతో పాటుగా రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. సాంకేతిక కారణంగా పలుచోట్ల రుణమాఫీ అమలులో సమస్యలు వచ్చిందని చెప్పారు. షాద్‌నగర్ బరోడా బ్యాంకులో 576 మంది రైతులకు రుణ మాఫీ అమలులో సాంకేతిక సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వెంటనే సీఎం రేవంత్‌రెడ్డితో పాటు వ్యవసాయశాఖ కమిషనర్, బ్యాంక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించి ప్రభుత్వం రూ.6కోట్లు రైతుల ఖాతాలో జమచేసినట్లు వెల్లడించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు బిల్లా, రంగాలుగా వ్యవహరిస్తూ రుణమాఫీపై లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకొని ఇప్పుడు నీతులు వల్లించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి రైతులందరూ సమానమేనని, అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అందుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు కూడా ప్రభుత్వం రుణమాఫీ చేసిందన్నారు.



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న రైతులు

పర్యాటక క్షేత్రంగా జేపీదర్గా

కొత్తూరు: మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ప్రఖ్యాతి గాంచిన హజ్రత్ జహంగీర్ పీర్ దర్గాను పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో ఇన్ముల్‌నర్వ వాసులతో ఆయన మాట్లాడారు. దర్గా ఆవరణలో ఉన్న పీర్ల చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన చెప్పారు. దర్గాకు వచ్చే భక్తులకు దర్గా ఆవరణలో బస్టాండ్ లేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు గ్రామస్తులు ఎమ్మెల్యేకు వివరించగా.. ప్రయాణికులు, భక్తుల సౌకర్యార్థం బస్టాండ్‌ను నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దర్గాను అభివృద్ధి చేస్తే భక్తుల సంఖ్య పెరుగుతుందని, దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి లభిస్తుందని ఎమ్మెల్యే వెల్లడించారు. అభివృద్ధి పనులకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను స్థానిక నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఆగీరు రవికుమార్‌గుప్తా, గోవర్ధన్‌గౌడ్, ఖాజా, బాబు, కొమ్ము కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఘన నివాళి



ఆమనగల్లు: కిష్టారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



తలకొండపల్లి: వెల్జాల్‌లో..



కడ్తాల్‌లో..

ఆమనగల్లు: కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి వర్ధంతి ఆదివారం పట్టణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు జాతీయ రహదారిపై కిష్టారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు రాములు, బాలస్వామి, చందునాయక్, సాయిలు, వెంకటేశ్, భాస్కర్, శివకుమార్, యాదయ్య, ఆనంద్, దేవేందర్, రంజిత్, మహేశ్, అల్లాజీ, గిరి, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము పాల్గొన్నారు.

వెల్జాల్‌లో..

తలకొండపల్లి: మండల పరిధి వెల్జాల్‌లో మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందులో మాజీ ఉప సర్పంచ్ అజీజ్, నర్సింలు, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ముజిబర్ రహ్మాన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంబాజీ, అశోక్‌బాబు, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, రవీందర్‌గౌడ్, జంగయ్య, లక్ష్మణ్, నసీర్, అఫ్తాబ్, మల్లేశ్, రాజు పాల్గొన్నారు.

కిష్టారెడ్డి సేవలు చిరస్మరణీయం

కడ్తాల్: మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కిష్టారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు పర్యాయాలు కల్వకుర్తి ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి ఎడ్మ ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఇందులో మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు లాయక్‌అలీ, రాజుగౌడ్, వెంకటేశ్, రమేశ్‌అయ్యగార్, భిక్షపతి, రాంచంద్రయ్య ఉన్నారు.

నియామకం

మొయినాబాద్‌రూరల్: మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ యూత్ అసోసియేషన్ హిమాయత్‌నగర్ అధ్యక్షుడిగా మహ్మద్ ఖరీమ్‌ను మైనార్టీ గ్రామ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల పరిధి హిమాయత్‌నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మైనార్టీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా మహ్మద్ ఖరీమ్‌ను, ఉపాధ్యక్షుడిగా షేక్ రెహమత్‌లను ఎన్నుకొని వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం మైనార్టీ నాయకులు వారికి నియామకపత్రాలను అందజేసి పూలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇందులో అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవియాదవ్, జావిద్, ఆసీఫ్, రజాక్, వజీర్, మ హ్మద్ జబ్బార్, మిరాజ్, మహేశ్, కుమార్, మల్లేశ్ యాదవ్, గిరి, మైనార్టీ సభ్యులు ఉన్నారు.

కళకళలాడుతున్న పంటలు



జొన్న పంట



వరి పైరు

ఆమనగల్లు: వానాకాలం పంటలతో పల్లెలు కళకళలాడుతున్నాయి. తొలకరి వర్షాలకు రైతన్నలు విత్తులు విత్తగా.. మధ్యలో వరుణదేవుడు ముఖం చాటేశారు. దీంతో అన్నదాతలు దిగాలు చెందారు. ఆ తరువాత వరుణుడు కరుణించగా.. చిగురించిన జొన్న, వరి, పత్తి తదితర పంటలతో.. అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. ఈ ఏడు దిగుబడి బాగా వస్తున్నందని భావిస్తున్నారు.

పోరాట యోధుడు పాపన్నగౌడ్

- బహుజనుల కోసం ఉద్యమించిన మహనీయుడు
- సర్దార్ జయంతిలో వక్తలు



తలకొండపల్లి: పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్ తదితరులు

తలకొండపల్లి: తొలి బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. బహుజనుల సంక్షేమం కోసం పోరాటం చేసిన మహనీయుడని, భవిష్యత్ తరాల వారికి ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని ఆయన చెప్పారు. పాపన్న జయంతిని పురస్కరించుకుని ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ఉప్పల మాట్లాడారు. కుల, మత, జాతి, వర్గ విభేదాలు లేని సమాజం కోసం పోరాడిన మహనీయుడు పాపన్నగౌడ్ అని పేర్కొన్నారు. పీడితులు, బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన విప్లవ కారుడని వెల్లడించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, పెంచి పెద్దచేయాలని సూచించారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అల్లాజిగౌడ్, మండల అధ్యక్షుడు బాల కుమార్ గౌడ్, మాజీ ఎంపీపీ తిర్మణి నిర్మల, బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, శేఖర్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ లలిత, జ్యోతయ్య, మాజీ ఉప సర్పంచ్ అనిల్, శ్రీశైలంగౌడ్ ఉన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు సర్వాయి పాపన్నగౌడ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి రాజీవ్ కూడలిలో పాపన్న చిత్రపటానికి గౌడసంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, సంఘం కల్వకుర్తి అధ్యక్షుడు చుక్క అల్లాజీగౌడ్, ఉపాధ్యక్షుడు గంగారవి, మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, నాయకులు నారాయణ, వెంకటయ్య, బాలకృష్ణ, సుక్క వెంకటయ్య, లక్ష్మీపతి, నర్సింహ, కుమార్, యాదయ్య, అల్లాజీ, బాలకృష్ణ, గోదా సతీష్, యువజన సంఘం అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, సభ్యులు కుమార్‌గౌడ్, శివ, రాఘవేందర్‌గౌడ్, ఆంజనేయులు, శివ, సాయి, నరేశ్, శివ ఉన్నారు.



ఇబ్రహీంపట్నం: చెరువుకట్టపై..

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని గౌడ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక చెరువుకట్టపై ఉన్న పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందులో సంఘం నాయకులు శేఖర్‌గౌడ్, గోపాల్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు పాశం అశోక్‌గౌడ్, పల్లె గణేశ్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, యదయ్యగౌడ్, గరిగె శేఖర్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, న్యాయవాది రాములుగౌడ్ తదితరులు ఉన్నారు.



తుర్కయంజాల్: కొహెడలో..



ఆమనగల్లులో..



మాడ్గుల: అవురుపల్లిలో..